కాలపు సంస్కృతిలోనే మమ్మల్ని ఇంకా ఉంచుతున్నారు. మీరు చూస్తే తెల్లగా ఉన్నారు. అయినా మీరు ఈ వృత్తి ఆధారిత కులంలోకి ఎలా వచ్చారు?'' అన్నాడు కేల్విన్.

''భారత్‌లో ఐదు వేల ఏళ్ల క్రితం వెలసిల్లిన సింధు నాగరికతలో స్వదేశీయులతోపాటు మెడిటారేనియన్, మంగోలాయిడ్ ప్రోటోఆస్ట్రిల్లాయిడ్ ఆల్పినాయిడ్ అనే జాతులు కలిశాయి. వీటి సమ్మేళనం నుంచి చాతుర్వర్ణ వ్యవస్థ ఏర్పడిందనేది చరిత్రకారుల భావన. వేదకర్మలు నిర్వహించేవారు, పరిపాలించేవారు, వ్యాపారం చేసేవారు, పరిచారక వర్గం.. ఇలా నాలుగు జాతుల తర్వాత ఐదోవర్గం పంచములు.. అంటే అంత్యజులు, అస్పృశ్యులు. ఇలా మా దేశంలో అంటరానివారిగా, వంశానుగత వృత్తులను అనుసరించి ఆర్యుల కాలం నుంచి కోట్లాదిమంది అస్పృశ్యులుగానే పరిగణింపబడుతున్నాం. ఇలా విభిన్న భాషల, జాతుల సంస్కృతుల సమ్మేళనంలోంచి వైదిక సాహిత్యం పునాదిగా ఏర్పడిన ఈ కుల వ్యవస్థ.. సమాజంలో ఒక అపశృతి''..

హాసన్ చెప్పడం ముగించగానే కేల్విన్ కళ్లల్లో నీళ్లు నిలిచాయి. హాసన్ రెండు చేతులూ పట్టుకొని కళ్లకు అద్దుకున్నాడు.

* * *

ఆఫీస్ అయిన తర్వాత హోటల్‌కు దగ్గరగా ఉన్న పార్కులో నడుస్తున్నాడు హాసన్. ఆ పార్కులోని ఫౌంటెన్ దగ్గర ఆగాడు. అక్కడే కనిపించాడు కేల్విన్.

''సార్.. గుడ్ ఈవెనింగ్!'' అంటూ విష్ చేశాడు.

ఇద్దరూ కలిసి నడుస్తున్నారు. కొన్ని అడుగులు వేసేసరికి ఎవరి సెల్‌ఫోన్‌లోంచో ఒక తెలుగు సినిమా పాట.

'ఈ అమెరికాలో ఎక్కడినుంచీ తెలుగు పాట' అనుకుంటూ.. ఆ పాట వింటూ ఉండిపోయాడు హాసన్.

'వెళుతున్నా వెళుతున్నా.. మౌనంగా వెళుతున్నా
వెళ్లాలని లేకున్నా దూరంగా వెళుతున్నా
నా మనసు నీ నీడలో వదిలేసి వెళుతున్నా'..

ఆ పాట విని ఒక్కసారిగా నడుస్తున్నవాడల్లా నిల్చుండిపోయాడు. స్తబ్ధుగా అయిపోయాడు. కేల్విన్ హాసన్‌ను పరిశీలనగా చూసి..

''ఆర్ యు ఓకే సార్?'' అన్నాడు.

''ఓకే.. ఓకే..'' అంటూ ఓ బెంచీపై కూర్చున్నాడు.

అప్పటికి ఆరు దాటింది. ఆకాశంలో చిన్నచిన్న మబ్బులు. మెల్లగా చీకట్లోకి జారుకుంటున్న సంధ్య.

''అవును. సంధ్య.. సంధ్య..'' నోట్లో అనుకుంటున్న ఆ మాటలు పైకే గొణుక్కున్నాడు హాసన్.

అప్పటికే హాసన్‌తో చనువు ఏర్పడిన కేల్విన్..

''సంధ్య ఎవరు సార్?'' అన్నాడు.

''ఢిల్లీలోని జేఎన్‌యూలో నేను పీహెచ్‌డీ చేస్తున్న రోజుల్లో ఆమె ఎంఏ చదివేది. అప్పటికే కోర్సు వర్క్ పూర్తయి.. రీసెర్చ్‌లో పూర్తిగా మునిగిన నేను.. ఆమె ప్రేమలో కూడా పూర్తిగా మునిగిపోయాను. ఎన్నో సాయంత్రాలు.. ఆమెతో జ్ఞాపకాలు.. ఆగ్రాలో తాజ్ మహల్ సాక్షిగా నా ప్రేమను ప్రపోజ్ చేశాను. తను ఇంట్లోవాళ్లకు పరిచయం చేస్తానంటూ రమ్మంది. ఆమె సెమిస్టర్ బ్రేక్ సెలవులకు తన సొంతూరు రాజమండ్రి వెళ్లింది. అది మా ఊరే! మా తాత పుట్టింది, పెరిగింది రాజమండ్రే. అందుకే నేనూ సంతోషంగా బయల్దేరాను. మా మావయ్యలు, బాబాయిలు ఇంకా రాజమండ్రిలోనే ఉన్నారు.

మా నాన్నకు ఉద్యోగం రావడంతో ఢిల్లీ వచ్చేశాం. అప్పుడప్పుడూ సెలవులకు మా ఊరు వెళ్లేవాణ్ని. రాజమండ్రి వెళ్లిన తర్వాతి రోజు సాయంత్రమే సంధ్య ఇంటికి వెళ్లాను. నన్ను చూడగానే వాళ్ల డ్రాయింగ్ రూమ్‌లో కూర్చోబెట్టి లోపలికి వెళ్లింది సంధ్య. పావు గంట తర్వాత లోపలి నుంచి సంధ్య.. ఎవరితోనో చెబుతోన్న మాటలు నాకు లీలగా వినిపించాయి.

'హాసన్ అంటే ఎవరో అనుకున్నాం. గంగాధరం మనవడు. వాడెందుకు తెలీదు' అన్నారు ఎవరో.

'మీకు తెలుసా డాడీ?' అన్నది సంధ్య.

'హాసన్ వాళ్ల తాత ఏం చేసేవాడో తెలిస్తే.. నువ్వు అతగాడిని మన ఇంటివరకూ పిలవవు. అతగాడు స్వయంగా తన చేతులతో మానవ విసర్జనలను ఎత్తివేసేవాడు. మలంతో నిండిన ఆ పాత్రను తలపై పెట్టుకొని ఆ గోదారి గట్టు వెంబడి వెళుతుంటే.. అందరూ ముక్కు మూసుకొని దూరంగా జరిగేవారు. పాపం! ఏం చేస్తాడు.. అతని జీవనోపాధికి మానవుని మలమూత్రాలను చేతితో ఎత్తి తీసుకెళ్లడమే తప్పనిసరి!'.

'అయ్యో.. ఇప్పుడు అలాంటివేమీ లేవు. ఈ ఊర్లో హాసన్ మావయ్యలు, బాబాయిలు ఏదో వ్యాపారం చేసుకుంటున్నారు' అన్నది.

'అవును.. ఏం వ్యాపారమో తెలుసా?'.

'కాంప్లెక్స్..' అంటూ ఆగిపోయింది.

'అవును. వాళ్లు నడిపేది సులభ్ కాంప్లెక్స్! ఆ ముసలాయన 30 – 40 ఏళ్ల క్రితం డ్రైలెట్రిన్లు కడిగితే.. వాళ్లు ఇప్పుడు వెట్ లెట్రిన్లు కడిగే వృత్తిలో ఉన్నారు. ఏమీ మార్పు లేదు. నువ్వు వాళ్ల ఇంట్లోకి వెళతావా.. నీ ఇష్టం!' చెప్పాడతను.

ఆ మాటలు వింటున్న నేను.. ఆ సంభాషణలు ఇక వినలేకపోయాను. మనసులో కుంగుబాటు.

'లేదు డాడీ.. హాసన్ బాగా చదువుతాడు. బ్యాట్స్ మీద రీసెర్చ్ చేస్తున్నాడు. ప్రొఫెసర్ అవుతాడు!'.

ఆ మాటలకు అతను పెద్దగా నవ్వి..

'అంటే గబ్బిలాలే కదా? అదో అపశకునపు పక్షి. వాళ్ల జీవితాల్లాగే అదీ మనకు నిషిద్ధం. ఇక నీ ఇష్టం!'.

ఆ మాటలు విన్న నేను ఇక మరి వినలేకపోయాను. వేగంగా బైటికి వచ్చాను. అప్పటి నుంచి సంధ్య నన్ను కలవడం మానేసింది. మాటల్లేవ్.. నేను ఫోన్ చేసినా ఎత్తేది కాదు. తన ఎంఏ పూర్తి కావడంతో ఢిల్లీ నుంచి షిఫ్ట్ అయిపోయింది. ఆ తర్వాత ఆమెకు పెళ్లి అయిపోయింది. భర్తతో లండన్ వెళ్లిపోయింది. ఆమె వెళ్లే ముందు నాకు మెసేజ్‌గా పెట్టిందే మనం విన్న ఆ పాట. ఆమె మాటలు మాట్లాడటం ఆపేసినా బాగుండేది. కానీ, వెళ్లిపోయేముందు తన బాధను, నిస్సహాయతను ఆ పాట ద్వారా వ్యక్తంచేయడం నాకు కలవరం కలిగించింది. ఆమెతోనే లోకం అనుకుని బతుకుతున్న నాకు జీవితం శూన్యం అనిపించింది''..

హాసన్ చెబుతున్న అతని గతాన్ని వింటూ కేల్విన్ ఆర్తిగా, జాలిగా చూస్తూ ఉండిపోయాడు.

హాసన్ చెప్పడం కొనసాగించాడు.

''ఒకరోజు రాత్రి ఒక మిత్రుడి రూమ్‌లో ఒంటరిగా ఉండిపోయాను.. అతను ఊరు వెళ్లడంతో. ఆ రూమ్‌లో నిద్రమాత్రల సీసా కనిపించింది. నిద్ర పట్టని ఆ రాత్రి నాకు శాశ్వతంగా నిద్ర కావాలని కోరుకున్నాను. అలా గుప్పెడు నిద్రమాత్రలు నా గొంతులో పోసుకున్నాను. మెల్లగా కళ్లు మూతలు పడ్డాయి. నిద్రలో ఏవో కలలు. తాతయ్య గుర్తుకొచ్చాడు. మంగళగిరి గంగాధరం నా ఎదురుగా నిల్చొని తన కథ చెప్పడం మొదలుపెట్టాడు.

'నాయనా.. మున్సిపాలిటీ కాంట్రాక్టరు ఒక మోరీలో పూడిక తీసేందుకు నన్ను పిలిచాడు. ఆరోజు రాత్రయిపోయింది. తర్వాతి రోజు వస్తానని చెప్పాను. అయితే ఒప్పుకోలేదు. ఆ రాత్రే బలవంతం చేశాడు పనికి రమ్మని. ఆరోజే పనిలోకి దిగాను. ఇంతలో హఠాత్తుగా వ్యాపించిన విషవాయువులు.. నన్ను ఊపిరి ఆడకుండా చేశాయి. అంతే! నా ఊపిరి అనంతవాయువుల్లో కలిసిపోయింది. నా శవం దొరకడానికి ఆరు రోజులు పట్టింది. నాలాగా ఇలా నిండు జీవితాన్ని బలి తీసుకున్న సఫాయి కార్మికులు ఎందరో! నేను మన కులం కారణంగా బలయ్యాను. నువ్వు కూడా అదే కులం చేసిన గాయాలు తట్టుకోలేక జీవితాన్ని చాలించాలనుకుంటున్నావా? ఇక మనం బతికేదెప్పుడు? బాగుపడేదెప్పుడు?'..

తాత మాటలు నాలో ప్రతిధ్వనించాయి.

సంధ్య, తాతయ్య ఇద్దరూ నీడల్లా కదులుతున్నారు. సంధ్య నీడ కదిలిపోయింది. తాతయ్య నన్ను పట్టి లేపుతున్నాడు. ఇంతలో నా మిత్రుడు లోపలికి వచ్చి, మత్తుగా చావు అంచుల వరకు వెళ్తున్న నన్ను రక్షించాడు. కాదు.. తాతయ్యే నన్ను కాపాడినట్టున్నాడు''.. చెప్పడం ముగించాడు హాసన్.

అప్పటికే సంధ్య పూర్తిగా కనుమరుగైంది. చీకటి ఆవరించింది. హాసన్ చెప్పిన ఆ విషాదభరిత ప్రేమ కథకు కేల్విన్ కళ్లు తడిచాయి.

''యు ఆర్ అన్‌టచబుల్ సార్... నిజంగా అన్‌టచబుల్. ఎవరూ టచ్ చేయలేని స్థితికి ఎదిగారు!''.

''ఇది విజయమో.. విషాదమో!'' అంటూ తనలో తానే గొణుక్కున్నాడు హాసన్, కేల్విన్ మాటలకు.

అంతలో తల కిందికి వేలాడుతోన్న ఒక పక్షి.. రెక్కలు విప్పుకొని తన తల మీదినుంచి నీడలా పైకి ఎగురుకుంటూ వెళ్లినట్టనిపించింది హాసన్‌కు.

## డాక్టర్ ఎమ్ సుగుణ రావు



'గబ్బిలంలాగానే ఎన్నో జీవితాలు సమాజ నిరాపేక్షకు, నిర్దయకు గురవుతున్నాయి. అస్తిత్వం కోసం, ఉనికి కోసం ఆ జీవితాలు పడే తపన, ఆవేదనే.. ఈ గబ్బిలం కథా వస్తువు' అంటున్నారు డా. ఎం. సుగుణరావు. ఈయన స్వస్థలం పశ్చిమ గోదావరి జిల్లా నర్సాపురం. ప్రస్తుతం విశాఖపట్నంలో స్థిరపడ్డారు. వెటర్నరీ సైన్స్‌లో మాస్టర్స్ డిగ్రీ చేశారు. భారత ప్రభుత్వరంగ బీమా సంస్థలో స్కేల్ –4 అధికారిగా పదవీ విరమణ పొందారు. మూడు దశాబ్దాల రచనా అనుభవంలో మూడు వందల పాతిక కథలు రాశారు. వీటిలో నూట పాతిక కథలకు బహుమతులు అందుకున్నారు. ఈ మధ్యే 'అన్వీక్షికి ఉగాది నవలల పోటీ'లో 'ఫైనల్ డయాగ్నోసిస్' అనే నవలకు ప్రోత్సాహక బహుమతి వచ్చింది. స్వాతి వీక్లీ నవలల పోటీలో 'మరుగేలరా' అనే నవలకు, ఇటీవలే 'ఏడు గుర్రాల సూర్యుడు' నవలకు లక్ష రూపాయల బహుమతి దక్కింది. 'ఆకాశంలో ఒక నక్షత్రం' కథను ఇంగ్లీష్ నాటకంగా మలచగా.. 'టాటా లిట్‌ఫెస్ట్ సుల్తాన్ పదాంశీ' అంతర్జాతీయ నాటక పోటీలలో ద్వితీయ బహుమతి పొందింది. జాబిలి మీద సంతకం, నేలకు దిగిన నక్షత్రం, ఆకాశంలో ఒక నక్షత్రం, సుగుణ కథాభిరామ డాక్టర్ ఎం.సుగుణ రావు బహుమతి కథలు పేరుతో కథా సంపుటాలను వెలువరించారు.